

చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక -311 శుక్రవారం 13 మార్చి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మానవతా దృక్పథంతో

# వైద్యం అందించాలి

### : మెడికవర్ ఆస్పత్రి 25వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో సీఎం

**ప్రపంచానికే వైద్య సేవలు అందించాలి**

**ఆ దిశగా రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది**

**విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత**

**ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మందుల ఉత్పత్తి**

**ఏడాదిలో ఒక నెల ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలి**

**మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవ్వాలి**



మణికొండ**మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
విద్య, వైద్యం, వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచానికి వైద్య సదుపాయం అందించే కేంద్రంగా మన రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 40 శాతం మందుల ఉత్పత్తి రాష్ట్రంలోనే జరుగుతోందని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రపంచవ్యాప్తంగా నాలుగు కోవిడ్ టీకాలు ఉత్పత్తి అయితే అందులో మూడు టీకాలు మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేశామని తెలిపారు. **మిగతా 2లో...**



## యుద్ధం ఆగాలంటే.. ఇరాన్

# మూడు షరతులు!

**అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం ముగింపునకు మూడు షరతులు పెట్టిన ఇరాన్**

**తమ హక్కులను గుర్తించి, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్**

**భవిష్యత్తులో దాడులు జరగవని హామీ ఇవ్వాలని స్పష్టం చేసిన అధ్యక్షుడు**

**తమ పోర్టులపై దాడి చేస్తే రీజియన్‌లోని అన్ని పోర్టులే లక్ష్యమని మిలిటరీ హెచ్చరిక**

**న్యూఢిల్లీ,మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకడానికి ఇరాన్ మూడు కీలక షరతులను ముందుకు తెచ్చింది. ఒకవైపు శాంతి కోసం ప్రతిపాదనలు చేస్తూనే, మరోవైపు తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఆ దేశ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది.ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఈ షరతులను ప్రకటించారు. రష్యా, పాకిస్థాన్ దేశాధినేతలతో మాట్లాడిన తర్వాత ఆయన ఈ పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్, అమెరికా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని ముగించాలంటే ఇరాన్ చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. **మిగతా 2లో...**


# ఏపీ రైతులకు ఉగాది కానుక...

### నేడు అన్నదాత సుఖీభవ 3.0 సాయం

**46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,000 చొప్పున జమ**

**కృష్ణా జిల్లా సూరంపల్లిలో నిధులు విడుదల చేయనున్న సీఎం చంద్రబాబు**

**ఏడాదికి రూ.20 వేల హామీ పూర్తి చేసిన కూటమి ప్రభుత్వం**



**అమరావతి,మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం రైతన్నలకు 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ చేయనుంది. 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ 3.0'లో భాగంగా రైతులకు నేడు(మార్చి 13) ఆర్థిక సాయాన్ని విడుదల చేయనుంది. **మిగతా 2లో...**

# భారత నౌకలు వెళ్లొచ్చు

**'హర్మూజ్'ను సురక్షితంగా దాటిన రెండు భారత నౌకలు!**

**ఇరాన్ విదేశాంగ మంత్రితో జైశంకర్ చర్చలతో సానుకూల పరిణామం**

**యుద్ధం మొదలైన తర్వాత హర్మూజ్ దాటిన తొలి భారత నౌక**

**సౌదీ నుంచి ముంబై చేరిన ఆయిల్ ట్యాంకర్ షిప్**



## త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

**పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం**

**రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి**

**ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



హైదరాబాద్,**మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ **మిగతా 2లో...**

## టీజీపీఎస్సీ ఓటీఆర్‌లో కొత్త రూల్స్

**టీజీపీఎస్సీ వన్‌టైం రిజిస్ట్రేషన్‌లో కీలక మార్పులు**

**జనవరి, జూన్ నెలల్లో మాత్రమే అప్‌డేట్ చేసుకునే అవకాశం**

**విద్యార్హతల సర్టిఫికెట్లను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి**

**ఓటీఆర్ వివరాల ఆధారంగానే ఉద్యోగాలకు అర్హత నిర్ణయం**

**తప్పుడు సమాచారం నమోదు చేస్తే ఓటీఆర్ రద్దు**




**మార్చి: మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు ఇది ముఖ్య గమనిక. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తన వన్‌టైం రిజిస్ట్రేషన్ విధానంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇకపై ఉద్యోగ ప్రకటనలకు అభ్యర్థుల అర్హతను కేవలం ఓటీఆర్‌లో పొందుపరిచిన వివరాల ఆధారంగానే నిర్ధారించనుంది. **మిగతా 2లో...**

## పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

### 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్..

**తెలంగాణలో ఉత్కంఠ రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం**

**అన్ని పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారన్న న్యాయవాది అభిషేక్ సింఘ్వీ**

**స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో విచారణ ముగిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు**



**న్యూఢిల్లీ,మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. **మిగతా 2లో...**

## కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

**లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్**

**హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు**



**హైదరాబాద్,మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ కోకాపేటలోని 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రికి నటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. 'అల్లు సినిమాస్'లోని ఏర్పాట్లను అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. **మిగతా 2లో...**

## ఉస్మానియా విశ్వవిద్యాలయం

# తెలంగాణాకు ఐకాన్

**1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్**

**నిధులు మంజూరు చేయడం అభినందనీయం**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు**



**హైదరాబాద్మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**
స్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక



# కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

**మొదటి పేజీ తరువాయి**

అనంతరం డాల్బీ స్క్రీన్‌లో ప్రదర్శించిన పలు ప్రచార చిత్రాలను వీక్షించారు. ఈ ఈవెంట్‌లో దర్శకులు రాఘవేంద్రరావు, బోయపాటి శ్రీను, క్రిష్, నందినిరెడ్డి, పలువురు నిర్మాతలు, నటీనటులు పాల్గొన్నారు. 'అల్లు సినిమాస్'లో నాలుగు స్క్రీన్లు ఉండగా.. స్క్రీన్–1లో డాల్బీ విజన్ సౌలభ్యం ఉంది. ఇది ఆసియాలోనే అతి పెద్దదిగా 75 అడుగులు ఉంటుంది. ఉగాది సందర్భంగా ఈ మల్టీప్లెక్స్‌లో సినిమాలు ప్రదర్శన ప్రారంభం కానుంది. శుక్రవారం నుంచి 'బుక్ మై షో' వేదికగా బుకింగ్స్ ఓపెన్ కానున్నాయి. 'ధురంధర్: ది రివెంజ్' మూవీ ప్రీమియర్స్‌తో ప్రేక్షకులకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.అంతకుముందు గురువారం సాయంత్రం ఈ వేడుక సినీ, రాజకీయ నాయకుల సమక్షంలో గ్రాండ్ గా జరిగింది.

# యుద్ధం ఆగాలంటే.. ఇరాన్ మూడు షరతులు!

**మొదటి పేజీ తరువాయి**

అంతేకాకుండా యుద్ధం వల్ల జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాలని, భవిష్యత్తులో తమ దేశంపై మళ్లీ దాడులు జరగకుండా కఠినమైన అంతర్జాతీయ హామీలు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మూడు షరతులకు అంగీకరిస్తేనే శాంతి సాధ్యమని ఆయన తేల్చిచెప్పారు.

ఇరాన్ అధ్యక్షుడు శాంతి కోసం షరతులు విధిస్తున్న తరుణంలోనే ఆ దేశ సైన్యం నుంచి తీవ్ర హెచ్చరికలు వెలువడ్డాయి. ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి అబోల్ఫజల్ షెకార్చి ప్రభుత్వ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ అమెరికాకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఒకవేళ అమెరికా తమ దేశంలోని పోర్టులపై దాడి చేస్తే, పర్షియన్ గల్ఫ్‌లోని ఏ ఒక్క పోర్టు, ఆర్థిక కేంద్రం, లేదా ఇతర ప్రాంతం సురక్షితంగా ఉండదని హెచ్చరించారు. "మా ఓడరేవులపై దాడులు జరిగితే, ఈ రీజియన్‌లోని అన్ని పోర్టులు, రేవులు మా చట్టబద్ధమైన లక్ష్యాలుగా మారతాయి" అని ఆయన పేర్కొన్నారు.

అంతేగాక తమ పోర్టులపై దాడి జరిగితే ఇప్పటివరకు చేసిన దానికంటే చాలా భారీ స్థాయిలో సైనిక చర్య చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ ప్రాంతంలోని దేశాలు తమ భూభాగాల నుంచి అమెరికన్లను తరిమికొట్టాలని కూడా షెకార్చి పిలుపునిచ్చారు. ఒకవైపు ఇరాన్ రాజకీయ నాయకత్వం శాంతి కోసం షరతులు పెడుతూనే, మరోవైపు సైనిక నాయకత్వం తీవ్రమైన పరిణామాల గురించి హెచ్చరించడం పశ్చిమాసియాలో నెలకొన్న సంక్లిష్ట, ఉద్రిక్త పరిస్థితికి అద్దం పడుతోంది.

# భారత నౌకలు వెళ్లొచ్చు

**న్యూఢిల్లీ,మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**

పశ్చిమాసియా యుద్ధ మేఘాల మధ్య అత్యంత ఉత్కంఠ నెలకొన్న హర్మూజ్ జలసంధిని రెండు భారత వాణిజ్య నౌకలు సురక్షితంగా దాటాయని సమాచారం. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ మధ్య జరిగిన కీలక చర్చల అనంతరం ఈ సానుకూల పరిణామం చోటుచేసుకుందని తెలుస్తోంది. యుద్ధ ఉద్రిక్తతల వల్ల ఈ జలసంధి గుండా ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిన తరుణంలో భారత జెండా ఉన్న నౌకలకు ఇరాన్ ప్రభుత్వం ప్రత్యేక భద్రతా భరోసా కల్పించింది.ఈ దౌత్యపరమైన ముందడుగుతో భారత్‌కు అందే ముడి చమురు, ఎరువుల సరఫరాకు ఎదురైన అతిపెద్ద అడ్డంకి తొలగిపోయింది. జైశంకర్ తన ఇరాన్ సహచరుడితో జరిపిన సంప్రదింపుల్లో భారత ఆర్థిక ప్రయోజనాలను, నౌకల భద్రతను ప్రధానంగా ప్రస్తావించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఇరాన్, భారత నౌకలను తమ ఐఆర్ జీసీ దళాలు లక్ష్యంగా చేసుకోబోవని, అవి జలసంధిని దాటేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చింది.

**యుద్ధం మొదలైన తర్వాత హర్మూజ్ దాటిన తొలి నౌక..**

ఇరాన్, అమెరికా మరియు ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం మొదలైన తర్వాత హర్మూజ్ జలసంధి దాటి తొలి ముడి చమురు నౌక భారత్‌కు చేరుకుంది. 'హిందుస్థాన్ టైమ్స్' నివేదిక ప్రకారం.. సౌదీ అరేబియా నుంచి ముడి చమురును తీసుకువస్తున్న 'షెన్‌లాంగ్ సూయజ్‌మాక్స్' చమురు ట్యాంకర్ ముంబై పోర్టుకు చేరుకుంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా సురక్షితంగా ప్రయాణించిన మొదటి భారతీయ నౌక ఇదే.

లైబీరియాలో రిజిస్టరైన ఈ ట్యాంకర్ కు ఒక భారతీయుడు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇది మార్చి 1న రాస్ తనూరా చమురు టెర్మినల్‌లో ముడి చమురును లోడ్ చేసుకుని, రెండు రోజుల తర్వాత తన ప్రయాణాన్ని ప్రారంభించింది. మారిటైమ్ ట్రాకింగ్ సంస్థలు 'లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్', 'ట్యాంకర్ ట్రాకర్స్' నివేదికల ప్రకారం.. ఈ నౌక మార్చి 8న హర్మూజ్ జలసంధి లోపల ఉన్నప్పుడు చివరిసారిగా దీని సిగ్నల్ నమోదైంది.

# పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు

**మొదటి పేజీ తరువాయి**

ఫిరాయింపులపై దాఖలైన మొత్తం 10 పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిష్కరించారని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. సదరు 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినట్లు ఆయన తెలిపారు. సింఘ్వీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను రెండు రోజుల్లోగా ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో, ఈ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

# ఏపీ రైతులకు ఉగాది కానుక...

**మొదటి పేజీ తరువాయి**

మూడవ విడతగా 46.85 లక్షల మందికి కేంద్ర, రాష్ట్ర వాటా కలిపి ఒక్కో రైతు అకౌంట్‌లో రూ.6,000 జమ చేయనుంది. మూడో విడతగా రూ.2,676 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేస్తున్నాయి. ఇందులో రాష్ట్ర వాటా రూ.1,874 కోట్లు. ఇప్పటికే రెండు విడతల కలిపి రూ.14 వేలను ప్రభుత్వం అందించింది. శుక్రవారం ఇచ్చే రూ.6 వేలతో కలిపి రైతులకు ఇచ్చిన హామీ ఏడాదికి రూ.20 వేల సాయం పూర్తవుతుంది.

**ఏడాదిలో రూ.8,985 కోట్ల సాయం**

ఒక్కో రైతు కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని కూటమి ఎన్నికల వేళ సూపర్ –6 హామీల్లో పేర్కొంది. కేంద్రం పీఎం కిసాన్ కింద రూ.6,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000 కలిపి మూడు విడతల్లో ప్రతీ రైతు కుటుంబానికి ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2025 ఆగస్ట్ 2న మొదటి విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,174 కోట్లు, నవంబర్ 19న రెండవ విడతగా రూ.7 వేల చొప్పున రూ.3,135 కోట్లు కలిపి రూ.6,309 కోట్లు రైతులకు అందించింది. రేపు మూడో విడతలో రూ.6 వేల చొప్పున 46.85 లక్షల మందికి రూ.2,676 కోట్లు ఇవ్వనుంది. ఒక్క ఏడాదిలోనే రైతు సోదరులకు కూటమి ప్రభుత్వం రూ.8,985 కోట్లు అందించినట్లు అవుతుంది. ఇందులో రాష్ట్ర వాటా రూ.6,560 కోట్లు కాగా, కేంద్రం వాటా రూ.2,425 కోట్లు.

**సూరంపల్లి నుంచి నిధులు విడుదల చేయనున్న సీఎం**

అన్నదాత సుఖీభవ 3.0 నిధులు విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. కృష్ణాజిల్లా, గన్నవరం నియోజకవర్గం, సూరంపల్లిలో శుక్రవారం అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.20 గంటలకు సీఎం సూరంపల్లికి చేరుకుంటారు. 4.25 గంటల నుంచి 4.55 గంటల వరకు రైతు సోదరులతో ముఖాముఖి అవుతారు. 5.00 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు.

# టీజీపీఎస్సీ ఓటీఆర్‌లో కొత్త రూల్స్

**మొదటి పేజీ తరువాయి**

ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ వివరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకోవడం అత్యవసరంగా మారింది. కొత్త నిబంధనల ప్రకారం అభ్యర్థులు తమ ఓటీఆర్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి ఏడాదిలో రెండుసార్లు మాత్రమే అవకాశం ఉంటుంది. ప్రతి సంవత్సరం జనవరి, జూన్ నెలల్లో వారం నుంచి 10 రోజుల పాటు ఓటీఆర్ అప్‌డేట్ విండోను అందుబాటులో ఉంచుతారు. ఆ సమయంలో అభ్యర్థులు తాము కొత్తగా సంపాదించిన అదనపు విద్యార్హతలను, ఇతర మార్పులను నమోదు చేసుకోవచ్చు. ఇప్పటికే ఓటీఆర్‌లో అదనపు అర్హతలు నమోదు చేసుకోని వారు, ఈనెల 25వ తేదీలోగా తమ ఐడీతో లాగిన్ అయి సర్టిఫికేట్లను అప్‌లోడ్ చేయాలని కమిషన్ సూచించింది.

**సర్టిఫికెట్ల అప్‌లోడ్ తప్పనిసరి**

గతంలో ఓటీఆర్‌లో విద్యార్హతలు, ఇతర వివరాలను పేర్కొంటే సరిపోయేది. కానీ, తాజా సవరణల ప్రకారం నమోదు చేసే ప్రతి అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాన్ని (సర్టిఫికెట్‌ను) తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి. అభ్యర్థులు తమ తాజా కలర్ ఫొటోను, కొత్తగా పొందిన విద్యార్హతల సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. అదనపు అర్హతలు, చిరునామా, ఈడబ్ల్యూఎస్, నాన్–క్రీమీలేయర్ కేటగిరీలు, ఫోన్ నంబర్, ఈ–మెయిల్ ఐడీ వంటివి మాత్రమే అప్‌డేట్ చేయడానికి వీలుంటుంది. ఒకసారి అప్‌డేట్ చేసిన ఓటీఆర్, అభ్యర్థి లేదా కమిషన్ రద్దు చేసేంత వరకు చెల్లుబాటులో ఉంటుంది.

# మానవతా దృక్పథంతో వైద్యం అందించాలి

**మొదటి పేజీ తరువాయి**

ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్యులు మానవతా దృక్పథంతో వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

వైద్యులు, వైద్య సిబ్బంది ప్రవర్తన ద్వారా కూడా రోగి ఎంతో ఉపశమనం పొందుతాడని అన్నారు. రాష్ట్రంలో మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలని, అప్పుడే ఆయా కుటుంబాలు పుష్టిగా ఉంటాయని సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా నానక్‌రామ్‌గూడలోని ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ పరిధిలో మెడికవర్ ఆస్పత్రి 25వ బ్రాంచ్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్ రఘువీర్ రెడ్డి, మెడికవర్ ఆస్పత్రి చైర్మెన్ అనిల్ కృష్ణతో కలిసి సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం ప్రసంగించారు. మెడికవర్ ఆస్పత్రి 2014లో ప్రారంభమై 12 ఏండ్లుగా ఉత్తమ సేవలు అందించడం వల్లనే దేశస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. మానవత్వంతో కూడిన వైద్య సదుపాయం అందించినప్పుడే రోగులు సంతృప్తి చెందుతారని తెలిపారు.




550 బెడ్లు, 18 ఆపరేషన్ థియేటర్లతో ఆస్పత్రి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫార్మా ఇండస్ట్రీలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మందుల ఉత్పత్తిలో మన రాష్ట్రానికి 40 శాతం వాటా ఉందన్నారు. వైద్య రంగంలో సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం ఇచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద ప్రయివేట్ వైద్యులు కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడాదిలో కనీసం ఒక నెల పనిచేయాలని అన్నారు. అప్పుడే వైద్యులపై ప్రజలకు నమ్మకం కలుగుతుందని తెలిపారు. హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా అభివృద్ధి చెందుతోందన్నారు.

అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆస్పత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ఇటువంటి ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఎంతో సహాయపడతాయని తెలిపారు. మెడికవర్ ఆస్పత్రుల ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జి. అనిల్ కృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆస్పత్రిని ప్రారంభించామని చెప్పారు.

ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎ. శరత్ రెడ్డి మాట్లాడుతూ.. 640–స్లైస్ సీటీ స్కాన్, వేగవంతమైన హార్ట్ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో ఖచ్చితమైన నిర్ధారణ చేసి రోగులకు సమయానికి చికిత్స అందించొచ్చని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.హరికృష్ణ మాట్లాడుతూ.. హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతున్న నేపథ్యంలో ప్రపంచ స్థాయి వైద్య సేవల అవసరం పెరుగుతోందని, ఆ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డైరెక్టర్ డా. ఎ.ఆర్. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, ఆధునిక వైద్య పరికరాలు, సమగ్ర వైద్య విధానాలతో ఈ ఆస్పత్రి రోగులకు వేగవంతమైన, సమర్థవంతమైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు.

# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

**మొదటి పేజీ తరువాయి**

బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కనుసన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ సమ ప్రాధాన్యత ఇవ్వాలని

డిప్యూటీ సీఎం సూచించారు. ఈ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం అని తెలిపారు. జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సివి ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్

**మొదటి పేజీ తరువాయి**

ఇంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్–26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికీ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని




ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాధ్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్–26

వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

# చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..?

**ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా పెత్తనం ఏంటి**

**ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో దొరికి పోవడంతోనే అమెరికాకు దాసోహం**

**లోక్‌సభలో రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు**

**న్యూఢిల్లీ,మార్చి12 (జర్నలిస్ట్ వార్త):**

భారత విదేశాంగ విధానన్ని మోడీ అమెరికాకు తకట్టు పెట్టారని విపక్షనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. రష్యా నుంచి చమురు దిగుమతులకు అమెరికా అడ్డంకులేంటని ప్రశ్నించారు. మనం చమురు ఎక్కడ కొనాలో అమెరికా నిర్ణయిస్తుందంటే మన విదేశాంగ విధానం తాకట్టు పెట్టినట్లేనని అన్నారు. హర్మూజ్ జలసంధి నుంచి పెద్ద ఎత్తున దిగుమతులు జరగాల్సి ఉంది. యుద్ధం కారణంగా దిగుమతులు ఆగిపోయాయి. ఇది ఆరంభం మాత్రమే. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది. మనం ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికా నిర్ణయిస్తోంది. రష్యా నుంచి చమురు కొనాలో..?వద్దో..? మనకు మనం నిర్ణయించుకోవాలి. రష్యా నుంచి చమురు కొనుగోలుపై అమెరికా జోక్యం ఎందుకు..? భారత్ వంటి పెద్ద దేశానికి మరోదేశం అనుమతి ఎందుకు..? ఇలా ఎందుకు జరుగుతోందా అని ఆలోచించాను. నా ప్రశ్నకు సమాధానం ఎప్‌స్టీన్ ఫైల్స్ రూపంలో దొరికింది. ఎప్‌స్టీన్ ఫైళ్ల ప్రభావం ఎల్‌పీజీ దిగుమతులపై పడినట్లు ఉంది. ఎప్‌స్టీన్‌తో సంబంధాలను పెట్రోలియం మంత్రే అంగీకరించారని రాహుల్ వ్యాఖ్యలు చేశారు. ఇవి దుమారం రేపాయి. దీంతో స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. నోటీసు ఇచ్చిన అంశంపైనే మాట్లాడాలని సూచించారు. సభ్యుల ఇష్టాఇష్టాల మేరకు సభ నడవదని స్పష్టం చేశారు. ఇదే అంశంపై పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ ప్రసంగాన్ని విపక్షాలు అడ్డుకున్నాయి. ఎప్‌స్టీన్ అంటూ లోక్‌సభలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ఆ గందరగోళం మధ్యే మంత్రి మాట్లాడారు. ఇరాన్, అమెరికా – ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో గ్యాస్ కొరతతో భారతదేశం అల్లాడుతోందని రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ప్రస్తుత పరిస్థితికి మోదీ ప్రభుత్వమే కారణమని ఆయన విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతుందన్నారు. అమెరికా – ఇజ్రాయిల్, ఇరాన్ యుద్ధంలో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు 20 శాతం చమురు హార్మూజ్ జల సంధి నుంచి వస్తుందని వివరించారు. ప్రస్తుతం ఆ జల సంధిని మూసివేశారని పేర్కొన్నారు. గ్యాస్ కొరత కారణంగా దేశవ్యాప్తంగా రెస్టారెంట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎల్పీజీ గ్యాస్ కొరత నేపథ్యంలో ప్రజలు భయాందోళనలో ఉన్నారన్నారు. దేశానికి పునాది ఇంధన భద్రత అని అభివర్ణించారు. భారత్ వ్యవహారాలను అమెరికా శాసిస్తోందని మండిపడ్డారు.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



## సెటిల్ మెంట్ల కోసం ఇటుక బట్టీలపై
# తెర వెనుక కుట్రలు....?
### -బట్టీలపై ఎల్ టి ఆర్ కేసుల వెనుక ఉన్న దేవరు...?



**బయ్యారం/మార్చి 12.(జర్నలిస్ట్ వార్త):** బయ్యారం మండలంలో గత 40 సంవత్సరాల నుండి ఉపాధి కోసం ప్రభుత్వాల సహాయం లేకున్నా కొంతమంది వ్యాపారులు జీవనోపాధి కోసం,వందల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఇటుక బట్టీలను చిన్న తరహా పరిశ్రమ తరహా నెలకొల్పి మనుగడ సాధిస్తున్న విషయం తెలిసిందే..ఈ మధ్యకాలంలో మునుపెన్నడూ లేని విధంగా ఇటుక బట్టీలపై కొన్ని అరాచకశక్తులు పెన్ను ముసుగులో బట్టీల మనుగడను దెబ్బతీసే విధంగా బట్టి నడిపే వ్యాపారుల మనుగడ లేకుండా చేసే విధంగా ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇటుక బట్టీల నడిపే వారు రైతుల భూములను లీజుకు తీసుకొని నాలా కన్వర్షన్ అనుమతి తీసుకొని ఇటుక బట్టీ పనులు గావిస్తున్నారు.కొంతమంది మీడియా ముసుగులో చలామణి అవుతున్న వ్యక్తులు లీజుకిచ్చిన రైతుల వద్దకు వెళ్లి నీవు ఎలా లీజుకు ఇచ్చావు,అలా ఇవ్వకూడదని తెలియదా అంటూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం.బట్టీలు నడవకుండా చేయాలని,తెరచాటున కొంతమందిని నియమించుకొని అధికారుల వద్దకు పంపి ఎల్ టి ఆర్ కేసులతో ఉసిగొలుపుతూ వారి పబ్బం గడుపుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.మండలంలో ఇటుక బట్టీల వలన కూలీలకు ఉపాధి ప్రత్యక్షంగా పరోక్షంగా అనేకమందికి జీవనోపాధి కలుగుతుంది. అంతేకాకుండా ప్రభుత్వానికి పన్నుల రూపంలో సంవత్సరానికి కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది.కొత్తపేట గ్రామంలో వారాంతపు సంత వల్ల లక్షల రూపాయల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మన మండలంలోని ఇటుక అనుకూలంగా లభ్యం అవుతుంది.దీనిని జీర్ణించుకోలేని కొంతమంది మీడియా ముసుగులో తమ పెన్నుకు పవర్ ఉందంటూ అధికారుల వద్దకు వెళ్లి ఇటుక బట్టి యాజమాన్యాలకు ఫోన్లు చేపించి సెటిల్మెంట్ కార్యకలాపాలకు ఊతమిస్తున్నట్లు మండలంలో గుసగుసలు వినపడుతున్నాయి.

చిన్నతరహా ఇటుక బట్టీల వలన ఎవరికి నష్టం వాటిల్లుతుందో అర్థం కావడంలేదని బట్టీల యాజమాన్యం వారు ఆరోపిస్తున్నారు.అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నడుస్తూ ఉంటే అది అధికార యంత్రాంగం చూసుకోవాలి.కానీ కొంతమంది మీడియా ముసుగు వ్యక్తులకు వారు అడిగినంత ఇవ్వలేదని బ్లాక్ మెయిల్ ల పర్వం కొనసాగిస్తూ,గత కొన్ని సంవత్సరాలుగా బట్టీల వారి దగ్గర నుండి లబ్ది పొందిన వ్యక్తులు బయ్యారం మండలంలో ఇటుక బట్టిల పరిశ్రమ లేకుండా చెయ్యాలనే తలంపుతో వారిపైనే అక్రమ ఎల్ టి ఆర్ కేసులు పెట్టించి వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు పలువురు వ్యాపారుల ఆరోపణలు చేస్తుండడం మండలంలో తీవ్ర కలకలం రేపుతోంది.మండలంలో ఏ వ్యాపారులకు లేని ఎల్ టి ఆర్ కేసులు ఇటుక బట్టీ వ్యాపారుల మీదే ఎందుకో ప్రజల మదిలో మిలియన్ డాలర్ల ప్రశ్న.

## ముత్తారంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం



**భీమదేవరపల్లి/మార్చి12, (జర్నలిస్ట్** వార్త)హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం గ్రామం హోవల్దార్ పల్లిలో రూ.5 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఈ అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ మాట్ల హరి కుమార్ తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్డు నిర్మాణంతో హోవల్దార్ పల్లిలో ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు బొక్కల స్రవంతి, కార్యదర్శి సంపత్ కుమార్, వార్డు సభ్యులు మ్యాక నరేష్, రేణికుంట్ల సందీప్, పార్నందుల నవిత, కాంగ్రెస్ నాయకులు జైపాల్ రెడ్డి, యాకుబ్ దేవరాజ్ శంకర్, కడారి ఆదాం, మట్టెడ లింగయ్య, మ్యాక రాజు, పోగుల ప్రసాద్, స్థానికులు కత్తులు మల్లయ్య, నర్రెంగల సమ్మయ్య, బుసుమల్ల కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన
## 17వ వార్డు కౌన్సిలర్ పొన్నం స్వరూప

**స్టేషన్ ఘన్పూర్/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో ని 17వ వార్డులో చెవినబోయిన లచ్చమ్మ అనారోగ్యంతో మృతిచెందడజరిగింది. విషయం తెలుసు కున్న 17వ వార్డు కౌన్సిలర్ పొన్నం స్వరూప రాజయ్య గురువారం కుటుంబ సభ్యులను పరామర్శించి బాధిత కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ గోనెల ఉపేందర్,పొన్నం నాగరాజు,నీల పరశారములు, మాజీ వార్డు నెంబరు కుంభం నరేందర్,పండుగ అశోక్, మునిగేల రమేష్, రాజు, మధు,పవన్, ఊరిడి శ్రీను,వేముల రాము,శగ రాజు,శంకర్ , పిట్టల హరీష్ కుంభం శంకర్, రాజు, మధు, రాజ య్యా, యాదగిరి,సందీప్, పెసరు శ్రీను, నీల ప్రభ కర్ , పిట్టల చంద్రయ్య,పొన్నం రమేష్ కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గట్ల నర్సింగాపూర్‌లో
## అక్రమ పేలుడు పదార్థాల పట్టివేత
### రూ.5.77 లక్షల విలువైన పేలుడు పదార్థాలు సీజ్

**భీమదేవరపల్లి/మార్చి12, (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామ శివారులో పోలీసులు అక్రమంగా పేలుడు పదార్థాలను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎ. ప్రవీణ్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ కె. శంకర్, కానిస్టేబుల్ ఎ. శోభన్ బాబు, జి. శివరాజులతో కలిసి గురువారం మధ్యాహ్నం గట్లనర్సింగాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో గ్రామ శివారులోని కమాన్ వద్ద ఒక ఆటో డ్రైవర్ పోలీసులను చూసి భయంతో ఆటోను వెనక్కి తిప్పి వెళ్లడానికి ప్రయత్నించాడు. దాంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆటోను ఆపి తనిఖీ చేయగా, ఆటోలో భారీ మొత్తంలో పేలుడు పదార్థాలు ఉన్నట్లు గుర్తించారు. డ్రైవర్‌ను ప్రశ్నించగా అతను గుంజి ఐలయ్య విశ్వనాథ కాలనీ గ్రామానికి చెందినవాడిగా తెలిపాడు. ఆటోను తనిఖీ చేయగా అందులో జెలెటిన్ స్టిక్స్ 8 పెట్టెలు (మొత్తం 1,440 స్టిక్స్), డిటోనేటర్లు 1,900, కార్డెక్స్ వైర్ బండిల్స్ 10 లభ్యమయ్యాయి. ఈ పేలుడు పదార్థాలను అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలోని తన బంధువు వల్లెపు రాజయ్యకు చెందిన మాగజీన్ నుంచి తీసుకుని వచ్చానని, చుట్టుపక్కల గ్రామాల్లో బావుల తవ్వకాల కోసం కంప్రెసర్ యంత్రాలు నడిపే వారికి అమ్మేందుకు తీసుకువస్తున్నానని ఐలయ్య తెలిపాడు. అయితే పోలీసులకు ఎలాంటి లైసెన్స్ పత్రాలు చూపించలేకపోయాడు. దీంతో ఆటోతో పాటు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన పేలుడు పదార్థాల మొత్తం విలువ సుమారు రూ.5,77,500గా అంచనా వేశారు. తర్వాత నిందితుడు గుంజి ఐలయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో గుంజి ఐలయ్యతో పాటు వల్లెపు రాజయ్యపై కూడా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతు వేదికలో ముగిసిన రెండు రోజుల శిక్షణ
### : ఆధునిక సాగుపై రైతులకు అవగాహన






**వర్ధన్నపేట/మార్చి12 (జర్నలిస్ట్ వార్త):** 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ పథకం కింద దమ్మన్నపేట రైతు వేదికలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారంతో విజయవంతంగా ముగిసింది. వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం, నూనెగింజల సాగు, ఆధునిక సాంకేతికతపై అధికారులు విస్తృత అవగాహన కల్పించారు. మొదటి రోజు శిక్షణలో భాగంగా మామిడి, ఆయిల్ పామ్ తోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యానవన శాఖ అధికారులు వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వేధిస్తున్న కోతుల బెడదను తట్టుకోవడానికి ఆయిల్ పామ్, కుసుమ వంటి పంటలు ఎంతో మేలని శాస్త్రవేత్తలు సూచించారు. వేరుశనగ, కుసుమ సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వివరించారు. రెండవ రోజు కార్యక్రమంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ప్రతినిధి సారంగం గారు పాల్గొని వరి వంగడాల ఎంపికపై రైతులకు దిశానిర్దేశం చేశారు. మొక్కజొన్నలో వచ్చే ఎండు తెగులు నివారణకు ట్రైకోడెర్మా వీరిడిని ఎలా ఉపయోగించాలో రైతు పొలంలోనే ప్రత్యక్షంగా డెమో ఇచ్చి చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు నానో ఫర్టిలైజర్లను వాడాలని పిలుపునిచ్చారు. రైతులు బృందాలుగా ఏర్పడి డ్రోన్ల ద్వారా ఎరువులు, మందులు పిచికారీ చేయడం వల్ల కూలీల ఖర్చు తగ్గి, దిగుబడి పెరుగుతుందని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్.ఏ.ఆర్.ఎస్ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ మరియు ఉద్యానవన అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, మండలంలోని పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మంచి ఆలోచన
# జీవితానికి మార్గదర్శకం



మానవ పరిణామ క్రమంలో నాగరికత సాధించిన ప్రతీ విజయం వెనుక ఒక బలమైన ఆలోచన ఉంది. మనిషి మేధస్సులో మొలకెత్తే ఒక చిన్న ఆలోచన, ఒక గొప్ప ఆవిష్కరణగా మారి ప్రపంచ గతినే మార్చేయగలదు. ఆలోచనలు కేవలం ఊహలు కావు, అవి రేపటి వాస్తవాలకు పునాదులు. అందుకే మన పెద్దలు యద్భావం తద్భవతి అన్నారు. అంటే, మన ఆలోచనలు ఎలా ఉంటాయో, మన జీవితం కూడా అలాగే రూపుదిద్దుకుంటుంది.

### ఆలోచనే ఆయుధం

మంచి ఆలోచన ఒక దిక్సూచి వంటిది. చీకటిలో కొట్టుమిట్టాడుతున్న ప్రయాణికుడికి కాంతిరేఖ ఎలాగో, గమ్యం తెలియని జీవితానికి స్పష్టమైన ఆలోచన అలాగే దిశానిర్దేశం చేస్తుంది. సానుకూల దృక్పథంతో కూడిన ఆలోచనలు మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు కుంగిపోకుండా, ధైర్యంగా ముందుకు సాగేలా ప్రేరేపిస్తాయి. దీనికి విరుద్ధంగా, ప్రతికూల ఆలోచనలు మనిషి సామర్థ్యాన్ని హరించివేసి, అపజయం వైపు నడిపిస్తాయి.

### సమాజ హితం - వ్యక్తిగత వికాసం

కేవలం స్వార్థంతో కూడిన ఆలోచనలు తాత్కాలిక ప్రయోజనాన్ని ఇవ్వవచ్చు కానీ, సమాజ హితాన్ని కోరే ఉన్నతమైన ఆలోచనలే శాశ్వత కీర్తిని అందిస్తాయి. గాంధీజీ అహింసా సిద్ధాంతం, అంబేద్కర్ సామాజిక సమానత్వ భావన, అబ్దుల్ కలాం 'విజన్ 2020 – ఇవన్నీ ఒకప్పుడు కేవలం ఆలోచనలే. కానీ అవి కోట్లాది మందిలో స్ఫూర్తిని నింపి, సామాజిక మార్పుకు నాంది పలికాయి. వ్యక్తిగత జీవితంలో కూడా మనం చేసే ఆలోచనలే మన ప్రవర్తనను, మన వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తాయి.

### ఆచరణలో పెట్టడమే అసలైన విజయం

మంచి ఆలోచన రావడం ఎంత ముఖ్యమో, దానిని ఆచరణలో పెట్టడం అంతకంటే ముఖ్యం. గాలిలో మేడలు కట్టడం వల్ల ప్రయోజనం లేదు. ప్రతి గొప్ప ఆలోచన వెనుక నిరంతర కృషి, పట్టుదల తోడవ్వాలి. ఒక గొప్ప కావ్యం రాయాలన్నా, ఒక నూతన యంత్రాన్ని కనిపెట్టాలన్నా లేదా ఒక సామాజిక సమస్యను పరిష్కరించాలన్నా.. ఆరంభం ఒక చిరు ఆలోచనే కావొచ్చు, కానీ దాని ముగింపు అంకితభావంతో కూడిన శ్రమతోనే సాధ్యమవుతుంది. నేటి యువత ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఎంతో ఉంది. విజ్ఞానం పెరిగిన నేటి కాలంలో, విచక్షణతో కూడిన ఆలోచనలు మనల్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయి. నిరాశను వీడి, నవకల్పనల దిశగా అడుగులు వేయాలి. మన ఆలోచనలే మన భవిష్యత్తును నిర్మించే శిల్పులు. మనసును ఒక ఉద్యానవనంలా భావిస్తే, అందులో మంచి ఆలోచనలనే విత్తనాలు నాటి, ప్రగతి అనే ఫలాలను పొందుదాం. ఉన్నతమైన ఆలోచనలే ఉన్నతమైన జీవితానికి సోపానాలు.



సీనియర్ జర్నలిస్ట్
బిర్రు కరుణాకర్

# చట్టానికి కళ్ళు లేవు
# సాక్ష్యాలే న్యాయానికి చూపు

సమాజం శాంతి, క్రమశిక్షణలతో ముందుకు సాగాలంటే చట్టం పటిష్టంగా అమలవ్వడం అత్యంత అవసరం. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టమే పరమాధికారం. వ్యక్తి ఎంత గొప్పవాడైనా, ఎంత ప్రభావం కలిగి ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే. అందుకే పెద్దలు "చట్టానికి కళ్ళు లేవు" అని చెబుతుంటారు. ఈ మాటలో ఉన్న భావం ఏమిటంటే చట్టం వ్యక్తిని చూసి తీర్పు ఇవ్వదు; చేసిన పనిని, జరిగిన సంఘటనను మాత్రమే పరిశీలిస్తుంది. న్యాయవ్యవస్థలో సాక్ష్యాధారాలకు అత్యంత ప్రాముఖ్యత ఉంటుంది. ఒక కేసులో నిజం ఏదో నిర్ధారించడానికి కోర్టు ముందు సమర్పించే సాక్షులు, ఆధారాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎవరు ఏమి చెప్పినా అది బలమైన సాక్ష్యాలతో నిరూపితమైతేనే కోర్టు దానిని పరిగణలోకి తీసుకుంటుంది. అందుకే చట్టం సాక్ష్యాల ఆధారంగానే పనిచేస్తుంది అని న్యాయ నిపుణులు చెబుతుంటారు. సాక్ష్యం లేకుండా నిజాన్ని నిర్ధారించడం చాలా కష్టం.ఒక చిన్న ఆధారం కూడా పెద్ద నిజాన్ని వెలికి తీయగలదు. సాక్షులు చెప్పే నిజం ఒక కేసు దిశను పూర్తిగా మార్చగలదు. అందుకే న్యాయవ్యవస్థలో ప్రతి సాక్ష్యం ఎంతో విలువైనదిగా భావిస్తారు. ఒక వ్యక్తి ధైర్యంగా చెప్పే నిజం వల్ల నిరపరాధి రక్షించబడవచ్చు. అలాగే తప్పు చేసినవారు శిక్ష నుంచి తప్పించుకోకుండా ఉండవచ్చు.అయితే కొన్ని సందర్భాల్లో ప్రజలు భయం, ఒత్తిడి లేదా పరిచయాల కారణంగా నిజం చెప్పడానికి వెనుకడుగు వేస్తారు. ఇలా జరిగితే న్యాయం ఆలస్యం అవుతుంది. కొన్నిసార్లు తప్పు చేసినవారు శిక్ష నుంచి తప్పించుకునే పరిస్థితులు కూడా ఏర్పడతాయి. అందుకే ప్రతి పౌరుడు నిజాయితీగా సాక్ష్యం చెప్పడం తన బాధ్యతగా భావించాలి. సత్యం పట్ల నిబద్ధత ఉండటం సమాజానికి ఎంతో అవసరం.

న్యాయవ్యవస్థ యొక్క ప్రధాన లక్ష్యం సత్యాన్ని వెలికి తీయడం. నిరపరాధులను రక్షించడం, తప్పు చేసినవారికి తగిన శిక్ష విధించడం ద్వారా సమాజంలో న్యాయం నిలబడేలా చూడటం కోర్టుల బాధ్యత. సాక్ష్యాలు బలంగా ఉంటే న్యాయం ఆలస్యమైనా తప్పకుండా జరుగుతుంది. అందుకే "న్యాయం ఆలస్యమవచ్చు కానీ తప్పిపోదు" అనే నానుడి ఎంతో ప్రాముఖ్యత పొందింది.ప్రజాస్వామ్య దేశంలో చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి కర్తవ్యం. చట్టానికి లోబడి జీవించడం వల్లనే సమాజంలో శాంతి, భద్రత, క్రమశిక్షణలు నిలుస్తాయి. చట్టాన్ని పాటించే సమాజంలోనే న్యాయం నిలబడుతుంది. ప్రతి వ్యక్తి తన బాధ్యతను గుర్తించి సత్యానికి అండగా నిలబడాలి.మొత్తానికి చట్టం వ్యక్తిని కాదు, చేసిన పనిని మాత్రమే పరిశీలిస్తుంది. చట్టానికి కళ్ళు లేకపోయినా సాక్ష్యాలే దానికి చూపు. నిజం చెప్పే ధైర్యం, చట్టం పట్ల గౌరవం ఉన్నప్పుడే సమాజంలో న్యాయం నిలుస్తుంది. అందుకే ప్రతి పౌరుడు చట్టాన్ని గౌరవిస్తూ, సత్యానికి అండగా నిలబడితేనే సమాజం సుస్థిరంగా ముందుకు సాగుతుంది.



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే లెనిన్ సుధాకర్
9908401581

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల కిట్ అందజేత

**స్టేషన్ ఘన్పూర్/మార్చి 12 ( జర్నలిస్ట్ వార్త):**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాటికొండలో ఈ సంవత్సరం పదవతరగతి పరీక్షలకు హాజరవుతున్న 42 మంది విద్యార్థులకు సౌమిత్రి రంగాచార్య లు జ్ఞాపకార్థం వారిసతీమణి కృష్ణకుమారి కుటుం బ సభ్యులు లక్ష్మనాచార్యులు, రామాచార్య లు, వరుణంచార్యులు పరీక్షల కోసం పాడ్, పెన్ను లు, పెన్సిల్స్, హాల్ టికెట్ కవర్ తో కూడిన కిట్టు ను అందజేశారని ప్రధానోపాధ్యాయులు పెనుమా టి వెంకటేశ్వర్లు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాల కు,తల్లి తండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసు కురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోఅమ్మా ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ బేతి మంజుల ఉపా ధ్యాయులు రుద్ర, లింగమూర్తి, రంజిత్ కుమార్, డి. శ్రీనివాస్, రవీందర్, ఎం. శ్రీనివాస్, మురళి, అనసూయ, కృపమ్మ, సలావుద్దీన్, పిడీ గీరెడ్డి ప్రమోద్ రెడ్డి,జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్ వాసులకు శుభవార్త

### ఆర్టీసీ బస్‌స్టాప్ మంజూరు



**వైరా/మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):**వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ వాసుల దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం లభించింది. గత ఏడాది కాలంగా ఎదురుచూస్తున్న ఆర్టీసీ బస్‌స్టాప్‌కు అధికారులు మంజూరు ఇవ్వడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 20వ వార్డు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి, శ్యాంబాబు శాంతినగర్ ప్రాంతానికి బస్‌స్టాప్ అవసరాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి శాంతినగర్‌లో బస్‌స్టాప్ ఏర్పాటు చేయించారని తెలిపారు. దీంతో ఖమ్మం నుంచి వైరా వచ్చే బస్సులు, వైరా నుంచి ఖమ్మం వెళ్లే ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు శాంతినగర్ వద్ద ఆగనున్నాయి. బస్‌స్టాప్ మంజూరు చేయించిన ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌కు వైరా మున్సిపాలిటీ చైర్మన్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో పాటు కౌన్సిలర్ ఉంద్రు వరలక్ష్మి, శ్యాంబాబు కృతజ్ఞతలు తెలిపారు. పరిశుభ్రత చర్యలుఇదిలా ఉండగా వైరా మున్సిపాలిటీ 20వ వార్డులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం పలు అభివృద్ధి పనులు చేపట్టారు. బోర్ల మరమ్మత్తులు చేయడంతో పాటు మురికికాలువలను శుభ్రం చేశారు. తాగునీటి సరఫరా ట్యాంకుల్లో క్లోరినేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## దైనందిన జీవితంలో గణితం అవసరం

### విద్యార్థులకు బహుమతులు అందజేసిన ప్రిన్సిపాల్



**సత్తుపల్లి/మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):**
దైనందిన జీవితంలో గణితం ఎంతో అవసరమని, అది విద్యార్థుల్లో కచ్చితత్వం, క్రమశిక్షణను పెంపొందిస్తుందని విశ్వశాంతి విద్యాలయం ప్రిన్సిపాల్ పసుపులేటి నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో గణితంపై విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత లెక్కలను వేగంగా చేయడం కోసం కొందరు విద్యార్థులు గణిత పట్టికలను (టేబుల్స్) చూడకుండా కింద నుంచి పైకి చెప్పే విధంగా సాధన చేశారు. ఈ విధంగా 20 పట్టికల వరకు కింద నుంచి పైకి చెప్పిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ విధంగా సాధన చేస్తే గణితంలో మరింత చురుకుదనం పెరుగుతుందని తెలిపారు. శాస్త్ర, సాంకేతిక అభివృద్ధికి గణితం కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం సభ్యులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు శైలజ, కార్తీక్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


## కావూరి సాంబశివరావు మృతి పట్ల కేటీఆర్ సంతాపం

### నివాళులర్పించిన బీఆర్ఎస్ నేతలు



**ఖమ్మం/మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):**
మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు మృతి పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన కేటీఆర్, కావూరి సాంబశివరావు భౌతికకాయానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు.
అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్, ఈ దుఃఖ సమయంలో ధైర్యంగా ఉండాలని కోరుతూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ప్రజాసేవలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ వెంట మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాగంటి సునీత గోపీనాథ్ తదితర బీఆర్ఎస్ కీలక నేతలు పాల్గొని నివాళులర్పించారు.

## రైతులకు సబ్సిడీ వ్యవసాయ పరికరాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే.




**బయ్యారం/మార్చి 12.(జర్నలిస్ట్ వార్త);**
రైతులకు వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తుందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. చర్లపల్లి గ్రామపంచాయతీలో మండల వ్యవసాయ అధికారి రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కనకయ్య, ఏడిఏ శ్రీనివాస్ రావుతో కలిసి రైతులకు సబ్సిడీ వ్యవసాయ పరికరాలను గురువారం పంపిణీ చేశారు. మండలానికి చెందిన రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు,తైవాన్ స్ప్రేయర్లు,బ్రష్ కట్టర్లు తదితర వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు ఫయాజ్,నాగరాజు,లింగ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీ శబరిష్ నీ మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే. కోరం కనకయ్య.



**బయ్యారం/మార్చి 12.(జర్నలిస్ట్ వార్త);**ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గురువారం మహబూబాబాద్ జిల్లా ఎస్పి శబరిష్ నీ తన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి ఎస్పి కీ పూల బోకె ఇచ్చి శాలువాతో ఘనంగా సత్కరించ్చినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో శాంతి భద్రతలు,తదితర విషయాల గురుంచి ఎస్పి ఎమ్మెల్యే చర్చించినట్లు సమాచారం. ఎమ్మెల్యే వెంట బయ్యారం,గార్ల సోసైటీ మాజీ చైర్మన్స్ మూల మధుకర్ రెడ్డి,వడ్లమూడి దుర్గాప్రసాద్,కొత్తపేట మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ తదితరులు ఉన్నారు.

## నర్సంపేట అభివృద్ధి దొంతి మాధవరెడ్డితోనే సాధ్యం

### పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో టీపీసీసీ సభ్యులు పెండం రామానంద్



**నర్సంపేట/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):**
నర్సంపేట పట్టణ అభివృద్ధి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంతోనే సాధ్యమని టీపీసీసీ సభ్యులు పెండం రామానంద్ అన్నారు. గురువారం పట్టణంలోని 25వ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది చేత సైడ్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే పనులను పర్యవేక్షించారు. వార్డులో మంచినీటి సౌకర్యం, వీధి దీపాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడం, ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. నర్సంపేట మున్సిపాలిటీలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పారదర్శక పరిపాలన అందిస్తామని పెండం రామానంద్ తెలిపారు.



## చిత్రపటానికి పూలమాలలు వేసిన టీడీపీ నాయకులు



**వైరా/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** వైరా నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు మద్దినేని రామారావు పెద్ద కుమారుడు దివంగత మద్దినేని అశోక్ దశదిన కర్మ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, వైరాపాలేరు నియోజకవర్గ బాధ్యులు చెరుకూరి చలపతిరావు, కొండబాల కరుణాకర్, సీనియర్ టీడీపీ నాయకులు మోతుకూరు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే వైరా పట్టణ మున్సిపాలిటీ, రూరల్ మండల టీడీపీ అధ్యక్షులు బోల్లేపల్లి శ్రీను, కిలారు సురేంద్ర, తెలుగు మహిళా నాయకురాళ్లు చావా రాణి, తొందపునేని లింగమ్మతో పాటు జిల్లా టీడీపీ నాయకులు తదితరులు హాజరై దివంగత మద్దినేని అశోక్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

## ఘనంగా పోతుల రాయప్ప జన్మదిన వేడుకలు

**తల్లాడ/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):**

తల్లాడ మండల కేంద్రంలో పోతుల రాయప్ప జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నందమూరి తారక రామారావు ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల బాగోగులు చూసుకోవడం తన కర్తవ్యమని అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకొని పార్టీ పరంగా, సామాజిక దృక్పథంతో సేవ చేయడం తన లక్ష్యమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సత్తుపల్లి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీ విజయానికి తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయ మిత్రులు, స్థానికులు, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెన్నుల పంపిణీ



**తల్లాడ/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీమతి మట్టా రాగమయ్య దయానంద్ విజయకుమార్ ఆదేశాల మేరకు ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ వైస్ ఎంపీపీ అన్నం కోటిరెడ్డి, పోతురాజు కోటయ్య చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా అన్నం కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొని మంచి ఉత్తీర్ణత సాధించి తమ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పదో తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన ఎమ్మెల్యే మట్టా రాగమయ్య దయానంద్ విజయకుమార్‌కు కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలూరు రాజశేఖర్ రెడ్డి, సేలం వెంకటనారాయణ రెడ్డి, ఉప్పెర్ల రామారావు, నల్లబోతుల నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలకు హాజరైన టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు



**కొత్తగూడెం/మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పలు శుభకార్యాలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఇల్లందు క్లబ్ బంగ్లాస్ ఏరియాలో బాల్యమిత్రుడు జర్పలా లింగాలలిత దంపతుల కుమార్తె మౌనికయశ్వంత్ వివాహ వేడుకకు హాజరై వధూవరులనుఆశీర్వదించారు. అనంతరం కొత్తగూడెం పట్టణంలోని 36వ డివిజన్‌లో రామసత్యనారాయణనాగమణి దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో చిన్ననాటి గురువు జాన్ సార్, శీతంపేట బంజర సర్పంచ్ గుగులోతు జానకిరాం, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు కరీంపాషా, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు జయప్రకాష్, బాల్యమిత్రులు పరిమళ, వెంకటరమణ, మాజీ కౌన్సిలర్ సత్యబామసందర్ రాజు దంపతులు, మాదవరావు తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటి కల సాకారం కాంగ్రెస్‌తోనే సాధ్యం

## : నాగా సీతారాములు



**సుజాతనగర్ /మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** గూడు లేని నిరుపేదలకు సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తోందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామానికి చెందిన చిలువేరు పుల్లయ్య నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఇంటి యజమానులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సారథ్యంలో జిల్లాలో ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ద్వారా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రోహిణి, ఉప సర్పంచ్ రెడ్డిబోయిన వెంకన్న, మాజీ ఎంపీటీసీలు కసనబోయిన భద్రం, శైలజ, జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు యండి కరీం పాషా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ బిక్షం, పెద్ద వెంకన్న, సైదులు, బైకాని ఉపేందర్, సుజాతనగర్ మండల ఓబీసీ అధ్యక్షుడు కసనబోయిన లక్ష్మణ్, టౌన్ ఓబీసీ అధ్యక్షుడు జయప్రకాష్, సోషల్ మీడియా అధ్యక్షుడు బీరెల్లి వీరభద్రం, వార్డు సభ్యులు కట్టెబోయిన లింగమల్లు, మాలోత్ రాజు, గ్రామస్థులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్‌లో బీజేపీ శిక్షణా శిబిరం



**ధర్మసాగర్/ హనుమకొండ బ్యూరో మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాబియాన్2026 కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఆర్ఎన్ఆర్ హైస్కూల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో 24 గంటల శిక్షణా శిబిరం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు, జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు భైరపాక కుమార్ ఆధ్వర్యంలో ఈ శిబిరం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1951లో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ, శ్యామప్రసాద్ ముఖర్జీ ఆధ్వర్యంలో జనసంఘ్ పార్టీ స్థాపించబడిందని, అప్పటి ఎన్నికల్లో మూడు ఎంపీ స్థానాలు గెలుచుకుని ప్రజా పోరాటాల ద్వారా పార్టీని ప్రజల్లో బలపరిచారని తెలిపారు. అనంతరం కశ్మీర్, గోవా ఉద్యమాల ద్వారా పార్టీ విస్తరణకు కృషి చేసి 1977లో జనసంఘ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిందన్నారు. 1980లో భారతీయ జనతా పార్టీ ఏర్పడి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కే. అద్వానీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా పార్టీని విస్తరించిందని పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం చేపట్టిన రథయాత్రతో పార్టీకి విస్తృత ప్రజాభిమానాన్ని సంపాదించిందన్నారు. 1996లో 13 రోజుల పాలనలో అవినీతి ఆరోపణలకు తావులేకుండా ప్రభుత్వం రద్దు చేసినట్లు, అనంతరం 1998లో 13 నెలలు, 1999లో ఐదు సంవత్సరాలు సుపరిపాలన అందించి దేశ ప్రజల్లో బీజేపీపై విశ్వాసాన్ని పెంచిందన్నారు. 2014లో రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి గత దశాబ్ద కాలంగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని పేర్కొన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల అభివృద్ధి కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ దేశాన్ని ముందుకు తీసుకెళ్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి, రాష్ట్ర నాయకులు బొజ్జపెల్లి సుభాష్, ఉడుగుల రమేష్, ప్రశిక్షణ మహాబియాన్ ఇంచార్జి బల్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు పెరుమాండ్ల అమరేందర్ రెడ్డి, గంకిడి వెంకట్ రెడ్డి, సంపత్, మండల ప్రధాన కార్యదర్శులు శివప్రసాద్ రెడ్డి, సాయం సందీప్, నాయకులు రామ్మోహన్ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్యామ్ సుందర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు అనిరుధ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు గంగారపు రమేష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు పెసరు వెంకటేష్, గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యాసంగి మొక్కజొన్నకు రూ.2500 మద్దతు ధర ప్రకటించాలి

## యాసంగి రైతుబంధు తక్షణమే విడుదల చేయాలి: జన్ను రమేష్




**నర్సంపేట/ మార్చి 12 (జర్నలిస్టు వార్త):** యాసంగి మొక్కజొన్న పంటలకు క్వింటాల్‌కు రూ. 2500 మద్దతు ధర ప్రకటించాలని ఎంసీపీఐయు పార్టీ చెన్నారావుపేట మండల కార్యదర్శి జన్ను రమేష్ డిమాండ్ చేశారు. నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఎంసీపీఐయు పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసి ప్రతి మండలంలో కనీసం ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు వ్యవస్థ సక్రమంగా అమలు కాకపోవడంతో రైతులు తమ పండించిన పంటను ప్రైవేటు మధ్యదళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. పంటలకు సరైన మద్దతు ధర లేకపోవడంతో రైతులు పెట్టుబడులు, అప్పుల భారం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ వాటికి అనుగుణంగా కనీస మద్దతు ధర లేకపోవడం రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందన్నారు. యాసంగి మొక్కజొన్నకు మంచి ధర వస్తుందనే ఆశతో రైతులు విస్తారంగా సాగు చేసినప్పటికీ ధరలు లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని చెప్పారు. అలాగే రైతులకు పంట సహాయం కింద ప్రభుత్వం అందించే రైతుబంధు ఇప్పటివరకు విడుదల కాలేదని విమర్శించారు. యాసంగి పంటలు వేసి రెండు నెలలు కావస్తున్నప్పటికీ రైతులకు ఇవ్వాల్సిన పంటసాయం అందకపోవడం వల్ల ఆశలు నిరాశలుగా మారాయని అన్నారు. తక్షణమే యాసంగి రైతుబంధు విడుదల చేసి రైతులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొర్రి శ్రీను, అశోక్, రాజిరెడ్డి, గోరే మియా తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా

# ఫాతిమా మాత మహా ఉత్సవాలు





**ఖాజీపేట/మార్చి 12హనుమకొండ బ్యూరో (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లా కాజీపేట మండలంలో రోమన్ క్యాథలిక్ సంఘం ఆధ్వర్యంలో ఫాతిమా మాత మహా ఉత్సవాలు భక్తి శ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం విశ్వాసులు ఎంతో భక్తితో నిర్వహించే ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి పాల్గొన్నారు. చర్చి ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి పండుగ వాతావరణాన్ని తలపించింది. ఉత్సవాల సందర్భంగా ఫాతిమా మాత విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. పవిత్ర బలిపూజలు నిర్వహించి విశ్వాసులకు ఆధ్యాత్మిక సందేశాలు అందించారు. విశ్వాసులు తమ కుటుంబాల శ్రేయస్సు, సమాజ శాంతి, ప్రపంచ మానవాళి సంక్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు కొవ్వొత్తులు వెలిగించి మాతకు మొక్కులు చెల్లించుకున్నారు. మహా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనా సమావేశాలు, ఆధ్యాత్మిక సందేశాలు, భక్తి గీతాల కార్యక్రమాలు నిర్వహించారు. క్రైస్తవ మత బోధనలు, ప్రేమ, సేవ, క్షమ వంటి విలువలను విశ్వాసులకు వివరించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఫాతిమా మాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు భక్తి గీతాలు పాడుతూ, కొవ్వొత్తులు పట్టుకుని ప్రార్థనలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ ఊరేగింపును చూసేందుకు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా మహా ఉత్సవాల్లో పాల్గొని మాత ఆశీస్సులు పొందారు. చర్చి ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడం విశేష ఆకర్షణగా నిలిచింది. రాత్రి వేళల్లో చర్చి వెలుగులతో కళకళలాడుతూ భక్తులనుఆకట్టుకుంది. మహిళలు, యువకులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనల్లో భాగమయ్యారు.

ఈ మహా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ప్రత్యేకంగా ప్రసాదం పంపిణీ చేశారు. భోజన ఏర్పాట్లు కూడా చేశారు. ఉత్సవాలు విజయవంతంగా సాగేందుకు చర్చి కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు, యువత సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఫాతిమా మాత మహా ఉత్సవాలు ప్రతి సంవత్సరం విశ్వాసుల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేలానిర్వహించబడుతున్నాయి. ఈ ఉత్సవాల ద్వారా ప్రేమ, శాంతి, సేవా భావాలను సమాజానికి చేరవేయాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, సంఘ పెద్దలు, చర్చి కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫాతిమా మాత మహా ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరగడంతో ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# స్నేహమంటే ఇదేరా..!

## స్నేహితురాలికి అండగా పూర్వ విద్యార్థులు



**తల్లాడ/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** కలిసి చదువుకోవడమే కాదు.. ఆపదలో ఉన్న స్నేహితురాలికి అండగా నిలబడి నిజమైన స్నేహానికి నిదర్శనంగా నిలిచారు పూర్వ విద్యార్థులు. తల్లాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 199192 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రులు తమ చిన్ననాటి స్నేహితురాలు ప్రతిఫలం కోసం ముందుకొచ్చి ఇల్లు నిర్మించి అందజేశారు. తల్లాడ ఎన్టీఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతిఫలం కొన్నేళ్లుగా స్థలం ఉన్నప్పటికీ ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్నేహితులు అందరూ కలిసి చందాలు సేకరించి సుమారు రూ. 65 వేలతో ఒక గది, రేకుల వరండాతో ఇల్లు నిర్మించి మౌలిక వసతులు కల్పించి బహుమతిగా అందించారు. గురువారం ఈ ఇంటికి ఘనంగా గృహప్రవేశం నిర్వహించారు. తనతో కలిసి చదువుకున్న స్నేహితులు అండగా నిలబడి నిలువగూడు కల్పించడంతో ప్రతిఫలం ఆనందానికి అవధులు లేకపోయాయి. స్నేహితులు చేసిన సహాయానికి భావోద్వేగానికి లోనైన ఆమె వారికి కృతజ్ఞతలు తెలిపారు. గృహప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న స్నేహితులు ఉత్సాహంగా డాన్సులు చేస్తూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను పలువురు అభినందించారు. మల్లారం సర్పంచ్ కిరణ్, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రతిఫలానికి నూతన వస్త్రాలు అందజేశారు. స్నేహితులు రాణి, గోవర్ధన్, త్రివేణి, రవి, వెంకట్, నగేష్, కిషోర్, తిరుమలరావు, మధు, హుస్సేన్, రాజు, శ్రీను, నరసింహారావు, వేణు, చారి, బుచ్చారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పెన్నుల పంపిణీ



**తల్లాడ/ మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీమతి మట్టా రాగమయ్య దయానంద్ విజయకుమార్ ఆదేశాల మేరకు ఆశ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడ వైస్ ఎంపీపీ అన్నం కోటిరెడ్డి, పోతురాజు కోటయ్య చేతుల మీదుగా పదో తరగతి విద్యార్థులకు రైటింగ్ పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా అన్నం కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలను విజయవంతంగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించి తమ పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పదో తరగతి విద్యార్థులకు పెన్నుల పంపిణీ కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే మట్టా రాగమయ్య దయానంద్ విజయకుమార్‌కు కుర్నవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐలూరు రాజశేఖర్ రెడ్డి, సేలం వెంకటనారాయణ రెడ్డి, ఉప్పెర్ల రామారావు, నల్లబోతుల నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఇమ్మానియేల్ రాజ్



**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో మార్చి 12 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామానికి చెందిన మునిగళ్ల శోభ మృతి చెందిన విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి సింగపురం ఇందిరా కుమారుడు, యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ గురువారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొట్టే శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బైరపాక దివాకర్, ఉపసర్పంచ్ గొట్టం రవివర్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు కుక్కల వెంకటస్వామి, సీనియర్ నాయకులు బరిగల దయాకర్, బరిగల ప్రసాద్, బరిగల రాజు, కొత్తపల్లి రవీందర్, రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడి కోర్నెల్, ఘనపూర్ మండల మహిళా అధ్యక్షురాలు చింత జ్యోత్స్న, చిల్పూరు మండల యువజన ఉపాధ్యక్షుడు చాగంటి మని, బీసీ నాయకుడు తాటికొండ సంపత్, జాఫర్‌గడ్ మండల సీనియర్ నాయకుడు డేవిడ్ బాబు, బట్టమేకల శివరాజ్, ప్రతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సింగపురం ఇమ్మానియేల్ రాజ్

**స్టేషన్ ఘన్పూర్/మార్చి12 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గోనెల శ్రీనివాస్ కుమార్తె శిరీష - రాజ్ కుమార్ వివాహానికి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రె స్ పార్టీ ఇంచార్జ్ సింగపురం ఇందిరా తనయుడు, యువ నాయకులు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ ఎల్కతుర్తి లోని సత్య సాయి ఫంక్షన్ హాల్లో హజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రజిని ,రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక ,గ్రామ శాఖ అధ్యక్షుడు పోలు మహేందర్ ,మాజీ సర్పంచ్ కుక్క సారయ్య, దేవ కారి నర్సయ్య ,వార్డు సభ్యులు బోడ కుమార్, మండల సీనియర్ నాయకులు బిక్షపతి, పోలు ప్రభాకర్ ,ధర్మసాగర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రంజిత్ ,అఖిల్,చార్లెస్, సమీర్, ఆదిత్య,జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడి కోర్నెల్ ఘనపూర్ మండల అధ్యక్షురాలు చింత జ్యోష్ణ, బిసి నాయకులు తాటికొండ సంపత్ కుమార్, జాఫర్ఘడ్ సీనియర్ నాయకులు డేవిడ్ బాబు చిల్పురు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగం టి మణీ, బట్టమేకల శివరాజ్ ,ప్రతిష్ తదితరులు పాల్గొన్నారు.